సర్కిల్ డీసీకి శుభాకాంక్షలు..

మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణకు కార్పొరేటర్లు సబీహాబేగం, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు గౌసుద్దీన్ పుష్పగుచ్ఛాన్ని అందించి.. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ/అల్లాపూర్/మూసాపేట, నవంబర్ 8

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: కూకట్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంగీత్‌నగర్, దయార్‌గూడా, సాయి బాబాకాలనీ, శ్రీసాయినగర్, విజ్ఞాన్‌పూరి కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- బాలానగర్: సంచారపురికాలనీ ఫీడర్ పరిధిలోని సంచారపురి కాలనీ, పబ్లిక్ సెక్టార్ కాలనీ, ఉమనగర్, ముస్లిం గ్రేవ్‌యార్డ్, వాయునగర్, తెలంగాణ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు.
- రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని ఐడీ ఫ్రెష్ ఫుడ్స్, ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్, దక్కన్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు.
- పెన్షన్‌లైన్ ఫీడర్ పరిధిలోని సీతారాంపురం, కంసారీబజార్, దర్గీ బస్తీ, ఖాదర్‌జెండ, ఎంబీఎన్ ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు.
- ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ ఫీడర్ల పరిధిలోని పట్వారీ ఎన్‌క్లేవ్, ఎర్రగోడలు, ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో 11 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
- జీడిమెట్ల: ఐడీఏ సూరారం ఫీడర్, సూరారం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని షాపూర్‌నగర్ ఏఈ ఈఎస్ఆర్ కృష్ణ తెలిపారు.
- 11 కేవీ వినాయక్‌నగర్ ఫీడర్, 33/11కేవీ జీడిమెట్ల సబ్ స్టేషన్ 3 పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు జీడిమెట్ల ఫేజ్-1 ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జీడిమెట్ల ఏఈ పి.ప్రసూన తెలిపారు. అలాగే 11 కేవీ యాక్సిస్ ఫీడర్ జీడిమెట్ల సబ్ స్టేషన్ 4 పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫాక్స్ సాగర్ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.
- మియాపూర్: పీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో పీజేఆర్‌నగర్, జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, సుభాష్‌చంద్రబోస్ నగర్, మహావీర్ నగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 11నుంచి 1.30గంటల వరకు, 2.30నుంచి 4.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని.. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని భాగ్యనగర్ ఏఈ షాబాద్ విజ్ఞప్తి చేశారు.

'ఎంసీఏ' రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ (రెండేళ్ల కోర్సు) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 14వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కూకట్‌పల్లి రామాలయంలో గుడిగంటను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు సత్యనారాయణ, రోజాదేవిరంగారావు

అద్భుతంగా రామాలయం అభివృద్ధి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: కూకట్‌పల్లిలో నాలుగు వందల ఏండ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని పునర్ నిర్మాణం చేసి.. అద్భుతంగా అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి రామాలయంలో 150 కేజీలతో రూపొందించిన ఇత్తడి గుడిగంటను ఎమ్మెల్యే కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో చారిత్రాత్మక రామాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గ్రామస్తుల సహకారంతో దేవాలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయానికి గంటను విరాళంగా అందించిన నాయినేని సూర్యరావు, లక్ష్మీదేవి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవిరంగారావు, ఆలయ కమిటీ చైర్మన్ తులసీరావు, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

నేడు, రేపు ఓటర్ నమోదుపై స్పెషల్ డ్రైవ్

- ఈఆర్‌వో వంశీకృష్ణ

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడం.. అర్హులందరికీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేయడమే లక్ష్యంగా నేడు, రేపు ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గం ఈఆరోవో బి.వంశీకృష్ణ అన్నారు. నేడు ఉదయం నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుతో పాటు పాత జాబితాలోని పేర్లలో సవరణలు, చిరునామాలో మార్పులు, ఓట్ల తొలగింపులపై దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు లయన్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

అల్లాపూర్, నవంబర్ 8: లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో నేడు మోతీనగర్ కమ్యూనిటీహాల్ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు అన్నెం కోటిరెడ్డి తెలిపారు. మోతనగర్ హౌజింగ్ సొసైటీ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ, ఈసీజీ, వినిడికి పరీక్షలు, స్త్రీలకు మమ్మోగ్రఫీ, పాప్‌స్మియర్, ఎముకలు, కన్ను, దంతాల పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్తికమాసం శుభ సందర్భంగా ఫతేనగర్‌లోని జవహర్‌నగర్‌కాలనీలోని కనకదుర్గదేవి, కాళికాదేవి, శీతలాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఆలయ పూజారి దోర్భలకాశీనాథ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకము, కుంకుమార్చన, పసుపుబొట్టు తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. *– బాలానగర్, నవంబర్ 8*

పేదలకు వరం సీఎం సహాయ నిధి: పీఏసీ చైర్మన్ గాంధీ

నిరుపేదలకు సీఎం సహాయ నిధి పథకం వరంలా మారి ఆదుకుంటున్నదని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానల్లో ఉచితంగా వైద్య సేవలను పొందుతున్నారన్నారు. మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్ కాలనీకి చెందిన రవితేజకు సీఎం సహాయ నిధి పథకం ద్వారా వైద్య సేవల నిమిత్తం మంజూరైన రూ.60వేల ఆర్థిక సాయం చెక్కును పీఏసీ చైర్మన్ గాంధీ శుక్రవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానాటికీ పెరుగుతున్న ఆస్పత్రి బిల్లులకు అనుగుణంగా సహాయాన్ని సైతం పెంచాలని కోరారు. ఈ కార్రమంలో ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, నవంబర్ 8

సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

దుండిగల్, నవంబర్ 8: జగద్గిరిగుట్టలో ఈనెల 10న జరిగే 15వ సదర్ సమ్మేళనం వేడుకలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుత్బుల్లాపూర్ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. పలువురు నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి వెళ్లి కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీపీఆర్ యువసేన నాయకులు అంబటి రాంబాబు, బాణాల శంకర్, అఖిల్, మేకల రమేశ్, జగన్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువను నిర్మించాలి

కూకట్‌పల్లి జడ్పీ అపూర్వ్‌చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శిరీషాబాబురావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: వరదనీటి ముంపు సమస్యను పరిష్కరించేందుకు కాలువను నిర్మించాలని బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు కోరారు. శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌ను కలిసి డివిజన్ పరిధిలోని శివ శక్తి నగర్‌లో వరదనీటి కాలువను నిర్మించాలని, మూసాపేట జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీస్ నుంచి వసుందర వైద్యశాల వరకు సీసీ రోడ్డును వేయాలని, డివిజన్ పరిధిలో పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శివశక్తి నగర్‌లో మురుగునీటి కాలువ కంగిపోయిందని, ఈ సమస్యను గుర్తించి ముందస్తుగా పనులు చేయకపోతే రాబోయే వర్షాకాలంలో ముంపు సమస్యలు ఎదురవుతాయన్నారు. డివిజన్ పరిధిలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను పరిష్కారించేందుకు నిధులు కేటాయించాలని జడ్పీని కోరగా సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే..

మియాపూర్, నవంబర్ 8: ప్రభుత్వ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ వ్యాప్తంగా శనివారం నుంచి ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగు రోజులుగా ఎన్యూమరేటర్లు సర్వే నిమిత్తం ముందస్తుగా ఇండ్లకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియను పూర్తిచేశారని తెలిపారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్యూమరేటర్ల ముందస్తు ఏర్పాట్లను డీసీ మోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్ల శిక్షణ పూర్తి చేయటంతో పాటు అన్ని వార్డుల్లో తొలుత స్టిక్కరింగ్‌ను చేపట్టామన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమగ్ర వివరాలను సేకరించాలని, నిర్ధారిత ఫార్మాట్‌లో వాటిని నమోదు చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఎటువంటి జిరాక్స్ ప్రతులను ఇవ్వాల్సిన అవసరం లేదని, వివరాలను అందిస్తే చాలన్నారు. పర్యవేక్షకులు సైతం తగు పర్యవేక్షణ ద్వారా సర్వేకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సర్వే సందర్భంగా కులం పేరును తప్పుగా చెప్పొద్దని కోరారు. కాగా సర్వే నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసామని డీసీ మోహన్‌రెడ్డి స్పష్టం చేసారు. ఆయన వెంట డాక్టర్ రవి, పీవో ఉషారాణి, ఇతర అధికారులు ఉన్నారు.

సర్వే నిమిత్తం ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న అగ్నిమాపక సేవల మాజీ డైరెక్టర్ సి.లక్ష్మీప్రసాద్ తదితరులు

ఫార్మా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు

సవాలుగా మారాయి

మాదాపూర్, నవంబర్ 8: అత్యాధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, పరికరాలు, రిమోట్ మానిటరింగ్ మొదలైన సాధనాలు అందుబాటులో ఉన్నాయని, ఫార్మా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోవడం సవాలుగా మారిందని అగ్నిమాపక సేవల మాజీ డైరెక్టర్ సి.లక్ష్మీప్రసాద్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో రెండో రోజు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫెసా 2024 కార్యక్రమానికి ఈహెచ్ఎస్ హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శివ ప్రసాద్‌రెడ్డి, జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరితో పాటు నిర్వాహకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రియోట్ మానిటరింగ్, నిర్వహణలో సాంకేతికతను ఉపయోగించాలాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్మా పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సవాలుగా మరిందన్నారు. అత్యాధునిక పర్యవేక్షణ, పరికరాలు, రిమోట్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫార్మా పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల వలన ప్రాణనష్టం జరిగితే జీవిత బీమా మొత్తాన్ని రెట్టింపు చేయాలని ఫార్మా పరిశ్రమ కార్మికులు కోరుతున్నట్లు తెలిపారు. అగ్నిమాపక ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒకరు చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మా పరిశ్రమలో గత ఏడాది 97 అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు ఈహెచ్ఎస్ హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో 100 కు పైగా ఫార్మా కంపెనీలకు చెందిన 300 మంది సీనియర్ మేనేజర్లు, ప్రతినిధులు హాజరయ్యారు.

టీఎస్‌యూటీఎఫ్ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఏర్పాటు

కుత్బుల్లాపూర్, నవంబర్ 8: టీఎస్‌యూటీఎఫ్ కుత్బుల్లాపూర్ మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా కె.కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఏ.వసంత, కె.సుధాకర్, ఎస్.నర్సింహులు, కన్వీనర్‌గా ఎం.సంతోష్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాపన్నగారి మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఛఠ్ పూజలు



ఛఠ్ పూజలో పాల్గొన్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, నవంబర్ 8: బిహారీలు ఛఠ్ పూజను ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఫతేనగర్ శివాలయంలో బిహారీలు నిర్వహించిన ఛఠ్ పూజకు ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు సూరజ్‌కుమార్ తివారీ, రాజు ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛఠ్ పూజలో పాల్గొని ప్రజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిహారీల సాంప్రదాయ పండుగ అయిన ఛఠ్ పూజ ఘనంగా జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో దోబీఘాట్ ప్రహరీగోడ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 8: మౌలిక వసతులకు ప్రాధాన్యతనిస్తూ.. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో దోబీఘాట్ ప్రహరీగోడ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రజాసమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తి పనులపై దృష్టిసారించి.. వాటిని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దోబీఘాట్‌లో రజకులకు కావాల్సిన సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ సాయిప్రసాద్, స్థానిక నేతలు, రజకసంఘం సభ్యులు ఉన్నారు.

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, సీఐ నర్సింహ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జగద్గిరిగుట్ట, నవంబర్ 8: నేరాల్లో ప్రమేయం ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు హెచ్చరించారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ జరిపారు. మంచి ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సీఐ నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

నరేందర్‌గౌడ్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పెండెం నరేందర్‌గౌడ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ ఆర్‌కే పవన్ కుమార్ పర్యవేక్షణలో 'నీడ్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ఫర్ ఎల్ఐఎస్ ప్రొఫెషనల్స్ ఆఫ్ అకాడమిక్ లైబ్రెరీస్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి నరేందర్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు.

తక్షణమే జేఎల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 1392 జూనియర్ లెక్చరర్ అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జేఎల్ అభ్యర్థులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. 15 ఏండ్ల తరువాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల భర్తీకి 2022లో నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. 2023లో రాత పరీక్ష నిర్వహించగా, 2024 జూలైలో మెరిట్ జాబితాతో పాటు తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియామక పత్రాలు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహించి, 55 రోజుల్లో నియామక పత్రా లు అందజేసిన ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జేఎల్‌లుగా చేరి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నా రు. కార్యక్రమంలో అభ్యర్థులు డాక్టర్ లింగానాయక్, వేణు, రమేశ్‌రెడ్డి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, నాగరాజు, శ్రీనివాస్, అజయ్, నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.